సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



బీసీలపై ప్రభుత్వాల వివక్ష

బీసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు.

- 8లో▶



కార్మిక వ్యతిరేక విధానాలు..

ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఉత్తర డిస్కం శాఖ కార్యదర్శి శశికుమార్ అన్నారు.

- 8లో▶

గరిష్టం/కనిష్టం
31.0^0 / 17.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

6వ రోజుకు చేరిన దీక్షలు

● రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేత



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు చేపడుతున్న దీక్షలు మంగళవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ సందర్శించి మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ములుగు జిల్లా రామప్పలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రభుత్వంతో పోరాడి తమకు అండగా ఉండాలని కోరారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: జిల్లాకేంద్రంలోని మైనార్టీ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ఈనెల 15వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బుర్ర సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలో ప్రవేశాలకు మరిన్ని వివరాల కోసం ప్రిన్సిపాల్ రజిత 79950 57911, కళాశాల ప్రవేశాలకు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు 72079 98957 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

త్వరలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం



మహదేవపూర్: మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో త్వరలోనే డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తామని డీసీహెచ్‌ఎస్ సంజీవయ్య తెలిపారు. మంగళవారం సంజీవయ్య ఆస్పత్రిని సందర్శించారు. కరంటు సమస్య పరిష్కారం కోసం జనరేటర్, ఇతర సమస్యలను మెడికల్ సూపరింటెండెంట్ నివేదిక రూపంలో ఇస్తే వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. మరమ్మతుల అనంతరం డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ రవికిరణ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



మహదేవపూర్: అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏన్కపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ శ్రీరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కంటివెలుగు శిబిరాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఉమాదేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని అన్వేషిని, డాక్టర్ జగదీష్, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి రూరల్: ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుచేసి వచ్చే సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సేవాలాల్‌సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. గిరిజన యూనివర్సిటీ ప్రతిపాదన అందలేదని పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ప్రకటించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. 2017లోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించిందన్నారు. కేంద్రం గిరిజన యూనివర్సిటీపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలన్నారు.

నేడు 'తిరుగువారం' పండుగ

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మకు నేడు (బుధవారం) పూజారులు తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వ తేదీ వరకు మినీ జాతర ముగిసింది. దీంతో నేడు తిరుగువారం సందర్భంగా మేడారం, కన్నెపల్లి గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో పూజారులు వనదేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

'శివరాత్రి'కి గుంతల రోడ్డే..

17నుంచి 19 వరకు కాళేశ్వరంలో ఉత్సవాలు

- ● వివిధ ప్రాంతాల నుంచి రానున్న భక్తులు
- ● మహదేవపూర్ టు కాళేశ్వరం గుంతలతో నరకం



మహదేవపూర్ టు కాళేశ్వరం మధ్యలో గుంతల రోడ్డు

కాళేశ్వరం: మహాశివరాత్రి ఉత్సవాలకు కాళేశ్వరాలయానికి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఈనెల 17నుంచి 19వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకోనున్నారు. ఆర్టీసీతో పాటు ప్రైవేట్ వాహనాల్లో అత్యధికంగా వస్తుంటారు. కానీ మహదేవపూర్ టు కాళేశ్వరం వరకు అక్కడక్కడా మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. తెలంగాణ నుంచి వచ్చే భక్తులు ఇదే జాతీయ రహదారిపై 353(సీ) ప్రయాణం చేయాల్సి ఉంది. ఇటీవల రూ.163కోట్ల నిధులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రామగుండం సభలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రోడ్డు పనులు ప్రారంభించడంలో సంబంధిత కాంట్రాక్టర్, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు జాప్యం చేస్తున్నారు.

ప్యాచ్ వర్క్‌లు చేస్తే..

మహదేవపూర్ టు కాళేశ్వరం వరకు భారీగా గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు, ఫోర్‌వీలర్‌లకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. 15నిమిషాల్లో చేరాల్సిన గమ్యం 40నిమిషాలు పడుతుంది. గుంతలో కార్లు పడి ఆర్థికంగా నష్టపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు ప్రారంభించడం లేదు. కనీసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు గుంతలను పూడ్చి ప్యాచ్ వర్క్‌లు చేసి తాత్కాలికంగానైనా ఉపశమనం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

మరో 9 రోజులే..

మహాశివరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులు మాత్రమే ఉన్నాయి. ఈ లోపు దేవాదాయశాఖ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు సమీక్ష నిర్వహించి రోడ్డు సదుపాయాలపై చర్చించాల్సి ఉంది. ఇప్పటివరకు మహాశివరాత్రి ఉత్సవాలపై అధికారికంగా సమీక్షలు నిర్వహించలేదు. దీంతో రోడ్డు సరిగ్గా లేదని, ఇబ్బందులు తప్పేలా లేవని, ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని భక్తులు ప్రశ్నిస్తున్నారు. గుంతల రోడ్డే దిక్కు అని విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై సంబంధిత ఎన్‌హెచ్ ఏఈఈ సుమిత్‌కు ఫోన్‌ద్వారా సంప్రదించగా స్పందించ లేదు.

కనీసం ప్యాచ్‌వర్క్‌లు చేయాలి..



"మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు రోడ్డు పెద్దపెద్ద గుంతలతో ఇబ్బందిగా ఉంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాలకు ముందే గుంతలను పూడ్చి రవాణా సౌకర్యం కల్పించాలి.

– కీర్తి శ్రవణ్, సంజీవని సేవాసమితి అధ్యక్షుడు

ఉపాధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్: జిల్లాలో ఉపాధిహామీ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ప్రగతిభవన్‌లో అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి మంగళవారం ఉపాధి హామీ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు తగు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కూలీకి రూ.257 కూలి వచ్చే విధంగా పనిచేసేలా ప్రోత్సహించాలన్నారు. కూలీల వేతనాలు పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. ఉపాధిహామీలో చేపట్టిన ప్రతి పనిని జియో ట్యాగింగ్ చేయాలని చెప్పారు. సహజ వనరుల యాజమాన్యం కింద ఎక్కువ పనులను గుర్తించి వాటిని ప్రగతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డు లింక్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ పురుషోత్తం, ఎంపీడీఓలు, మండల పంచాయతీ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

ఐటీడీఏ పీఓ అంకిత్

ములుగు రూరల్: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన చేపట్టాలని ఐటీడీఏ పీఓ అంకిత్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాల, రాయినిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, మెనూ, స్టడీ అవర్స్, స్లిప్ టెస్టులు, స్టడీ మెటీరియల్ అందించిన విషయంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జీసీసీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆశ్రమ పాఠశాలల్లో మెనూ తప్పకుండా అమలు చేయాలన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించే విధంగా దృష్టి సారించాలన్నారు. కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరగా ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. రూ.1.50కోట్లతో భవనం నిర్మిస్తున్నామని వివరించారు. పాఠశాల భవన నిర్మాణ పనులను నిర్ణీత కాలంలో నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ హేమలత, డీఈ సంపత్, ఏఈఈ ప్రణీల పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి



మాట్లాడుతున్న సెగ్గం వెంకటరాణి

భూపాలపల్లి రూరల్: బాలల హక్కులు కాపాడాలని, బాలల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అన్నారు. బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ పరిధిలోని జంగేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారులు బాలల పరిరక్షణ కమిటీలకు శిక్షణ తరగతులు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి వెంకటరాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి వార్డులో బాలల వివరాలు.. వారి సమస్యల పట్ల వార్డు సభ్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు, బాల కార్మికులు, బడిమానేసిన బాలలు, బాలలపై వేధింపులు, మత్తు పదార్థాలకు బానిసలయ్యే బాలలు, పౌష్టికాహార లోపంతో బాధపడే బాలలను గుర్తించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. వార్డు పరిధిలో పరిష్కారం కాని సమస్యలు ఉంటే జిల్లా బాలల పరిరక్షణ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం 1వ, 2వ, 11వ, 14వ వార్డులకు బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి కమిటీ విధి విధానాలపై బాలల సంరక్షణ అధికారి వెంకటస్వామి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు దార పూలమ్మ, బానోత్ రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీత, డీసీపీయూ ఆఫీసర్ మొహినొద్దీన్, సోషల్‌వర్కర్ లింగారావు, ఇతర కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాలవి ప్రజావ్యతిరేక విధానాలు

డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలను అరిగోస పెడుతున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. కాటారం మండలకేంద్రంలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. గారెపల్లి కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలనపై వివరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాన్ని మొత్తం ప్రైవేటుపరం చేయాలనే దురుద్దేశంతో ఉన్నారన్నారు. ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ వంటి ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ దోపిడీ దొంగలకు అంటగట్టడానికి సిద్ధమవుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఛీ కొడుతున్నారని.. రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, పీసీసీ సభ్యుడు మధు, నాయకులు బొడ్డు మల్లయ్య, దండ్రు రమేష్, కుంభం స్వప్న, కోసరి భాస్కర్, కొట్టె శ్రీహరి, చీమల రాజు, సర్పంచ్‌లు అంగజాల అశోక్, కోడి రవికుమార్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్

ములుగు రూరల్(గోవిందరావుపేట): నిరుద్యోగులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ పిలుపునిచ్చారు. గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రా పీఎస్ఆర్ గార్డెన్స్‌లో సంజీత అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా పస్రా శివారులో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మరిచిపోయిందన్నారు. ఐటీ రంగంలో ఉద్యోగాలను ఊడదీస్తూ నిరుద్యోగులతో చెలగాటమాడుతోందని విమర్శించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడమేకాక మత విద్వేషాలు రెచ్చగొడుతుందని దుయ్యబట్టారు. నిరుద్యోగులు హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, రాజు, శ్రీను, ఉదయ్, జ్యోతి, రజిత, రేణుక, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర పనులు పూర్తి చేయండి
పోలీసులు సేవాభావంతో పనిచేయాలి
అన్నారం షరీఫ్ ఉర్సు షురూ..
- 10లో▶

మాట కలుపుతూ..ముందుకు

- ● ఉత్సాహంగా సాగిన రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ యాత్ర
- ● ములుగు జిల్లానుంచి మహబూబాబాద్ జిల్లాకు..
- ● ఉదయం రామప్పలో ప్రత్యేక పూజలు..
- ● ఆలయంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని విమర్శ
- ● ములుగు జిల్లాను సమ్మక్క సారలమ్మగా మారుస్తామని, మల్లంపల్లి మండలంగా ప్రకటిస్తామని వెల్లడి



సభకు హాజరైన జనం



ములుగులో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



మిర్చిని పరిశీలిస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పక్కన సీతక్క, గండ్ర సత్యనారాయణరావు

ములుగు/వెంకటాపురం(ఎం): టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ యాత్ర రెండోరోజు మంగళవారం కూలీల ఆత్మీయ పలకరింపులు.. మాటలో మాట కలుపుతూ.. వారి కష్టనష్టాలు తెలుసుకుంటూ ముందుకు సాగింది. ఉదయం 8:30 గంటలకు రామప్ప ఆలయంలో పూజలు చేసి ప్రారంభం కావాల్సిన యాత్ర ఆలస్యంగా 11:50 గంటలకు ప్రారంభమైంది.ములుగు ఎమ్మెల్యే సీతక్కతో కలిసి రేవంత్‌రెడ్డి .. ఉదయం 10:35 గంటలకు రామప్ప ఆలయాన్ని సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి అభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయంలో ఎంపీ రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్కలను ఆలయ పూజారి హరీశ్ శర్మ శాలువాలతో సన్మానించారు. అనంతరం టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి వారికి 45 నిమిషాల పాటు వివరించారు. షెడ్యూల్ ప్రకారం రామప్ప నుంచి రామాంజాపూర్, వెల్తుర్లపల్లి, బుద్దారం, కేశవపూర్ గ్రామాల మీదుగా కొనసాగాల్సిన పాదయాత్రను చివరి క్షణాల్లో మార్పులు చేసి రామప్ప నుంచి నర్సాపూర్ వెళ్లే లింకురోడ్డు ద్వారా కొనసాగించారు.

మిర్చి తోటను పరిశీలించి..

నర్సాపూర్‌కు వెళ్లేదారిలో ఇట్టబోయిన రాజయ్య, భాషబోయిన కోటి మిర్చి తోటలను రేవంత్‌రెడ్డి పరిశీలించారు. మిర్చి తోటకు నల్లిరోగం వచ్చి నష్టపోతున్నామని, గిట్టుబాటు ధర లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి తగిన న్యాయం చేస్తామని రేవంత్ వివరించారు. అదే విధంగా ఇళ్లు నిర్మించుకునేందుకు ఒక్కో లబ్ధిదారునికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అక్కడినుంచి ములుగు మండలంలోని బండారుపల్లి నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు.

దద్దరిల్లిన ములుగు

బండారుపల్లి నుంచి ములుగు జిల్లా కేంద్రానికి యాత్ర చేరుకోగానే పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు చేరుకున్నారు. అభిమానులు జేజేలతో ములుగు దద్దరిల్లింది. కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు గజమాలతో రేవంత్‌రెడ్డిని సత్కరించారు. అనంతరం గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం రాగానే ములుగు జిల్లాను సమ్మక్క–సారలమ్మ జిల్లాగా మారుస్తామని, మల్లంపల్లి వాసుల చిరకాల కోరిక అయిన మండలం నెరవేరుస్తామని ప్రకటించారు. సీతక్కను మళ్లీ గెలిపించండి.. పెద్ద పదవితో ఇక్కడికి వస్తుందని అనడంతో కార్యకర్తలు ఈలల మోత మోగించారు. ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ ప్రజల్లో మార్పు కోసం రేవంత్‌రెడ్డి చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పాదయాత్రలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య, పీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, నాయకులు మిల్కూరి అయిలయ్య, సూర్యనారాయణ, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, జంగిలి రవి, బండి శ్రీనివాస్, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బానోతు రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను సాగనంపే సమయం ఆసన్నమైంది.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సాగనంపే సమయం ఆసన్నమైందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఉదయం రామప్ప ఆలయం ఎదుట ఎంపీ రేవంత్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. అద్భుత కళాఖండం రామప్ప దేవాలయమని, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని అభివృద్ధి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

భూపాలపల్లి అర్బన్: లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించబడుతాయని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లాకేంద్రంలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రిమినల్, సివిల్, బ్యాంకు లిటిగేషన్, విద్యుత్, భూ తగాదాలకు సంబంధించి కేసులు, రోడ్డు ప్రమాదాలు, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ కేసులో రాజీ పడేవారు హాజరుకావాలని సూచించారు. ఎటువంటి ఖర్చు లేకుండా కాలయాపన లేకుండా ఇరువర్గాలకు రాజీకుదుర్చి కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాలసర్ప పూజలకు భక్తుల రద్దీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కాలసర్ప పూజలకు మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి గోదావరి మాతకు మొక్కులు చెల్లించారు. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సామూహికంగా కాలసర్ప నివారణ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు.

క్లుప్తంగా

ఫిజియోథెరపీకి రూ.100 కోట్లు కేటాయించాలి

- అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ఫిజియోథెరపిస్టులు

హన్మకొండ: ఫిజియోథెరపీ వైద్యానికి రూ.100 కోట్లు కేటాయించాలని తెలంగాణ అసోషియేషన్ ఆఫ్ ఫిజియోథెరఫిస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కోరారు. మంగళవారం హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరఫిస్ట్ రాష్ట్ర ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. మంత్రిని కలిసిన వారిలో అసోషియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విడుదల రాము, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రకాశ్, కోశాధికారి డాక్టర్ తిరుగుడు శివరామకృష్ణ, సత్యనారాయణ, సురేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం



ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ(లేబర్) ఏరియాకు చెందిన యువకుడు పోగుల వంశీ ఓ బాలికపై సోమవారం అర్ధరాత్రి తాగిన మత్తులో అత్యాచారం చేసేందుకు యత్నించాడు. అదే ప్రాంతానికి చెందిన బాలిక ఓ గుడిసెలో తల్లి, సోదరుడితో కలిసి ఉంటోంది. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న వంశీ అతిగా మద్యం సేవించి బాలిక గుడిసెలోకి వెళ్లి అత్యాచారానికి యత్నించాడు. ఆబాలిక పెద్ద ఎత్తున కేకలు వేయడంతో అతడు అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. బాలిక మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బాలికకు వేధింపులు

ఓ యువకుడు ప్రేమ పేరుతో బాలికకు దగ్గరై నెలరోజులుగా పెళ్లి చేసుకోవాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. పడమర కోటకు చెందిన ప్రశాంత్ మంగళవారం ఉదయం మరోసారి ఆబాలికను వెంబడించి తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులతో చెప్పడంతో మంగళవారం సాయంత్రం ఆబాలిక తల్లి మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



ప్రభుత్వాలవి కార్మిక వ్యతిరేక విధానాలు

- తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం కార్యదర్శి శశికుమార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఉత్తర డిస్కం శాఖ కార్యదర్శి ఎం.శశికుమార్ అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరుబాట పట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భారతీయ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. మంగళవారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ కార్యాలయంలో చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను భారతీయ మజ్దూర్ సంఘ్, తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.శశికుమార్ మాట్లాడుతూ.. ఈనెల 14న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈధర్నాలో విద్యుత్ ఉద్యోగులతో పాటు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిమాండ్ల సాధనకు భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో భారతీయ జన సంఘం హనుమకొండ జిల్లా కన్వీనర్ గాదె మహేందర్, తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్‌నాయక్, కార్యదర్శి వేమన్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు డి.వేణుమాధవ్, కార్యదర్శి సంగీత్‌కుమార్, నాయకులు అనిల్‌రెడ్డి, యుగేందర్, వేణు, రాజ్‌కుమార్, బీఎంఎస్ ఎన్‌ఐటీ అధ్యక్షుడు కరుణాకర్, కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

బీసీలపై ప్రభుత్వాల వివక్ష



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: బీసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులు చేత పట్టుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశ జనాభాలో 60శాతం జనాభా ఉన్న బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేశాయన్నారు. బీసీలను విస్మరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. బీసీలను విస్మరించే వారికి తగిన గుణపాఠం చెప్పేరోజులు వస్తాయని హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని, అదే విధంగా బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. బీసీ జన గణనలో కులగణను చేపట్టాలని, ఢిల్లీలోని 8, 9వ తేదీల్లో ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ధర్నాకు బీసీలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మెరుగు శివానంద్, నాయకులు యుగంధర్, రాజు, పాతరబోయిన విజయ్, నాయిని సరస్వతి, విజయ, శ్రీనివాస్, నరేష్, రాజు, కుమారస్వామి, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, మురళీమోహన్, సురేందర్, సాదినేని కిరణ్ కుమార్ ఉన్నారు.

చేనేత రంగానికి చేయూతనివ్వని బడ్జెట్

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు చేనేత గురించి గొప్పగా మాట్లాడారని, కానీ బడ్జెట్లో చేనేతకు కేటాయించిందేమీ లేదన్నారు. కనీసం రూ.1000 కోట్లు కేటాయించి చేనేతను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘాలు కోరుతుంటే.. ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చేనేత, జౌళి రంగానికి కలిపి రూ.468 కోట్లు కేటాయించినట్లుగా చెబుతున్నా.. అందులో మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలోని పవర్ లూమ్స్‌పై తయారయ్యే బతుకమ్మ చీరలకు రూ.400 కోట్లు కేటాయించారని, దీంతో చేనేతకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బడ్జెట్‌ను పునఃపరిశీలించి కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడకపోతే చేనేత కార్మికుల ఆగ్రహానికి గురవాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

ఐఫోన్ అగ్గువ.. ఆపై కుచ్చుటోపీ!

- అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకున్న నిట్ విద్యార్థిని

కాజీపేట: ఇన్‌స్టాగ్రామ్‌లో అతి తక్కువ ధరకే ఐఫోన్ లభిస్తుందని వచ్చిన ఓ ప్రకటన చూసి అత్యాశకు పోయిన ఓ నిట్ విద్యార్థి రూ.42,497 నగదు పోగొట్టుకుంది. విద్యార్థిని తన ఫోన్‌లో ఇన్‌స్టా యాప్ చూస్తుండగా ఐఫోన్, డెల్ ఐ-5 ల్యాప్‌టాప్ తక్కువ ధరకు ఉందనే ప్రకటన చూసి ఆర్డర్ పెట్టింది. వెంటనే గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ల్యాప్‌టాప్ లేదని, వన్ ప్లస్ మొబైల్ ఉందని చెప్పగా.. రూ.42,497 నగదును ఆమె ట్రాన్స్‌ఫర్ చేసింది. రోజులు గడుస్తున్నా ఫోన్ రాకపోవడంతో ఆ నంబర్‌కు ఫోన్ చేయగా అవతలి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని కాజీపేట పోలీసులను ఆశ్రయించింది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

రూ. 34 వేలు పోగొట్టుకున్న చిరు వ్యాపారి..

హనుమకొండ విజయపాల్ కాలనీకి చెందిన చిరు వ్యాపారి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రూ.34 వేలు పోగొట్టుకున్నాడు. నిట్ వరంగల్ కలాం విశ్రాంతి గృహానికి బిస్లరీ వాటర్ బాటిళ్లు పంపించాలని గుర్తు తెలియని వ్యక్తి చిరువ్యాపారికి ఫోన్ చేశాడు. బాటిళ్లను ఎన్‌ఐటీకి తీసుకెళ్లగా ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి అక్కడ లేడు. దీంతో వ్యాపారి ఫోన్ చేయగా.. గుర్తు తెలియని వ్యక్తి రూ.20 నగదు మనీ ట్రాన్స్‌ఫర్ చేశాడు. రూ.34వేలు పంపిస్తే రూ. 68 వేలు పంపిస్తానని మాయమాటలు చెప్పాడు. చిరువ్యాపారి రూ.34 వేలు పంపించాడు. ఆతర్వాత అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన బాధితుడు కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

రుణమాఫీకి రూ.20వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మారపల్లి రాంచెంద్రారెడ్డి

హసన్‌పర్తి: పంట రుణాల మాఫీకి రూ.20వేల కోట్లు కేటాయించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయాల రుణమాఫీ చేయాలంటే బడ్జెట్‌లో పేర్కొన్న నిధులు సరిపోవన్నారు. నాలుగేళ్ల క్రితం బ్యాంక్ నుంచి లక్ష రూపాయాలు రుణం తీసుకున్న రైతుకు అది కాస్తా వడ్డీతో కలిసి రూ.1.83 లక్షలకు చేరిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల లక్ష రూపాయాలు రుణం తీసుకున్న రైతుకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, నాయకులు గంట సత్యం, తోట మధుసూదన్, బండారి శేఖర్, తిరుపతిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గరిగె మాధవి, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు రాజేశ్వరీ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యానికి నిదర్శనమే బడ్జెట్

- తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్‌కూరపాటి



మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

కేయూ క్యాంపస్: తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందనడానికి నిదర్శనమే ఈబడ్జెట్ అని యూనివర్సిటీలను ఆదుకోవాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కేయూలోని దూర విద్యాకేంద్రం పూలే విగ్రహాల వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 వసంతాల పూర్తి చేసుకుంటున్న కేయూకు గత 9 ఏళ్ల నుంచి సరైన నిధులు కేటాయించడంలేదన్నారు. యూనివర్సిటీలో ఉద్యోగులు, అధ్యాపకుల, జీతభత్యాలు దినసరి వేతన, లంప్సమ్, టైంస్కేల్, తాత్కాలిక ఉద్యోగులకు ఏడాదికి రూ.170 కోట్లు అవసరం కాగా.. కేవలం రూ.127 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇందులో కేయూ జాక్ ఛైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఇడపాక విజయకన్నా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, కేయూ ఎస్ఎస్‌యూ ఇంచార్జి ఎండి పాష, కేయూ జాక్‌వ్యవస్థాపకులు డాక్టర్ మంద వీరస్వామి, విద్యార్థులు మానస, శశికళ, ప్రమీల, శ్రీవల్లి, రమాదేవి, స్వప్న, జ్యోతి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బోరు వేస్తుండగా అడ్డుకున్న అటవీ అధికారులు

- రేంజ్ కార్యాలయం ఎదుట ఆదివాసీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

మంగపేట: మండలంలోని నర్సింహసాగర్ పంచాయతీ పరిధి శనిగకుంటలో తాగు నీటి అవసరాలకు బోరు వేస్తుండగా అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి అడ్డుకున్నారు. బోరు వేస్తున్న ప్రాంతం అటవీశాఖ పరిధిలోకి వస్తుందని, అనుమతుల్లేకుండా బోరు వేస్తే కేసు పెడతామని రిగ్ బోరు యజమానిని అధికారులు హెచ్చరించారు. దీంతో బోరు వాహనాన్ని యజమాని తీసుకెళ్లాడు. ఆగ్రహించిన 100 మంది గ్రామస్తులు మంగపేట అటవీశాఖ రేంజ్ అధికారి కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ ఆధ్వర్యంలో మండల కమిటీ నాయకులు సంఘీబావం తెలిపారు. ఈవిషయమై గిరిజనులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాస్‌కు సమస్యను వివరించారు. స్పందించిన రేంజ్ అధికారి షకీల్ పాష, తహసీల్దార్ సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్, జిల్లా నాయకులు అల్లె జనార్దన్, దంతెనపల్లి నరేందర్, ఎండి.యాకూబ్‌పాష, ముగులుట్ల సత్యనారాయణ, యంగయ్య, గ్రామస్తులు కుంజ నర్సయ్య, తోలెం నర్సింహారావు, తిరుమల్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం



నర్మద మణిదీప్‌రెడ్డి సాత్విక్ దీక్షిత్ అశ్రిత్‌రెడ్డి సోనిక

హన్మకొండ చౌరస్తా: ప్రతిష్టాత్మకమైన జేఈఈ (మెయిన్)-2023 సీజన్-1 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన విజయాలను సాధించి జాతీయస్థాయిలో విజయ దుందుబి మోగించారు. పి.నర్మద (ఏపీపీ నం.230310121150) 99.96 శాతం, ఎ.మణిదీప్‌రెడ్డి (ఏపీపీ నం: 230310066800) 99.96, జి.సాత్విక (ఏపీపీ నంబర్: 23031030537) 99.95 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని ఎస్సార్ విద్యాసంస్థల ఛైర్మన్ వరదారెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇవేకాకుండా జాతీయ స్థాయిలో వరుసగా వి.దీక్షిత్‌రెడ్డి(230310312590) 99.87, కె.అశ్రిత్‌రెడ్డి (230310326124) 99.84, సి.సోనిక (230310304793) 99.84, బి.సహర్ష (230310352495) 99.79, కె.క్రిష్ణకస్తూరి (230310131987) 99.79, షేక్‌అబ్దుల్ సమీర్ (230310807497) 99.78, జి.శివరాజ్ మాలిక్ (230310098294) 99.72, కె.రంజిత్‌రెడ్డి (230310303563) 99.7, ఆర్.రాజేశ్వరి (230310303563) 99.66, డి.శ్రవణ్‌కుమార్ (230310131987) 99.65శాతంతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను ఎస్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావాన్ని వ్యక్తీకరించారు. ప్రతీ ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో రెజోనెన్స్ విద్యార్థుల హవా

హన్మకొండ: జేఈఈ మెయిన్-23 మొదటి సెషన్ ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు హవా కొనసాగించారు. తమ విద్యా సంస్థలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు 99కి పైగా పర్సంటైల్, 41 మంది విద్యార్థులు 95కు పైగా.. 70 మంది విద్యార్థులు 90కి పైగా.. పర్సంటైల్ సాధించి విజయ దుందుబి మోగించారని రెజోనెన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. యాదా అక్షయ్ 99.60, ఇ.కార్తీక్ 99.41, ఎం.డి.అయాన్‌ఖాన్ 99.27, ఎస్.శ్రీవర్ధన్ 99.27, బిట్ల లహరి 99.24, బి.రూపేశ్ 99.09, బి.ఆకాశ్ 99.04, బిట్ల అక్షిత 99.03, టి.మోక్షజ్ఞ 99.01 పర్సంటైల్ సాధించారని వివరించారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో 99కి పైగా.. పర్సంటైల్ సాధించిన విద్యార్థులు విద్యా సంస్థల ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

బతుకుదెరువు.. గుండె బరువు

- స్టీల్ సామగ్రి అమ్మేందుకు వెళ్తుండగా ఆటో బోల్తా
- తల్లి ఒడిలో నుంచి ఎగిరిపడి చిన్నారి మృతి



రాణి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: బతుకుదెరువు కోసం బయల్దేరిన ఓ కుటుంబానికి గుండె బరువైంది. పొట్టకూటి కోసం ఊరూరా తిరిగి స్టీల్ సామగ్రి అమ్మే కుటుంబంలో ఆటో బోల్తా పడి విషాదం నిండింది. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారులో మంగళవారం ఆటో బోల్తా పడి రేబెల్లి యాలాద్రి-సమ్మక్క దంపతుల కుమార్తె రాణి(3) మృతి చెందింది. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన యాలాద్రి-సమ్మక్క దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరు బతుకుదెరువు కోసం ఊరూరా తిరిగి స్టీల్ సామగ్రి, అమ్ముతూ, గ్యాస్ స్టవ్‌లు మరమ్మతు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈక్రమంలో యాలాద్రి, సమ్మక్క తమ కుమార్తె రాణి కలిసి టాటా ఏస్ ట్రాలీ క్యాబిన్‌లో కూర్చున్నారు. వారితో పాటు వెనకాల ట్రాలీలో సమ్మక్క తల్లి వెంకటమ్మ కూర్చుని వరంగల్ వెళ్లేందుకు బయల్దేరారు. శనిగపురం శివారు గుండ్లబోడు తండా మూల మలుపు వద్ద గల రైస్ మిల్లు ప్రాంతానికి ఆటో చేరుకోగానే.. రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో ఒక్కసారిగా టాటాఏస్ ట్రాలీ అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈఘటనలో యాలాద్రి పక్కనే ఉన్న సమ్మక్క, చిన్నారి రాణి, ఆటో వెనుకభాగంలో కూర్చున్న వెంకటమ్మ రోడ్డుపై పడిపోయారు. సమ్మక్క, వెంకటమ్మకు స్వల్పగాయాలవగా.. రాణి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో వారిని ఆస్పత్రికి తరలించగా.. రాణి మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్సై సీహెచ్.అరుణ్‌కుమార్, స్థానికులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతి



వందన మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి పద్మ

చెన్నారావుపేట: ప్రమాదవశాత్తు బావిలో పడి వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ శివారు లచ్చినాయక్ తండాకు చెందిన భూక్య వీరు-పద్మ దంపతుల కుమార్తె వందన(15) మంగళవారం మృతి చెందింది. వందన హనుమకొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. మూడ్రోజుల క్రితం ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం తన తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. తన తాత హనుమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటర్ వద్ద ఉన్న స్టాటర్‌ను ఆన్‌చేసి రమ్మని వందనను చెప్పాడు. దీంతో ఆమె వ్యవసాయ బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటర్‌కు సంబంధించిన స్టాటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలిజారి వ్యవసాయ బావిలో పడింది. వందన ఎంతకూ తిరిగి రాకపోవడంతో హనుమ వెళ్లి చూడగా.. వ్యవసాయ బావిలో వందన శవమై కనిపించింది. తండావాసులు వందన మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వందన మృతదేహంపై పడి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

జ్వరంతో చిన్నారి..



కొత్తగూడ: జ్వరంతో చికిత్స పొందుతూ మండలంలోని జంగవానిగూడెం గ్రామానికి చెందిన పుల్సం కవిత-వెంకన్న దంపతుల కుమార్తె మహన్విత(3) మంగళవారం జ్వరంతో మృతి చెందింది. మహన్వితకు రెండ్రోజుల క్రితం జలుబు, జ్వరం వచ్చింది. చికిత్స కోసం సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చిన్నారి శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండడంతో వైద్యులు ఎంజీఎంకు రెఫర్ చేశారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు మృతురాలి తల్లితండ్రులు తెలిపారు.

పాముకాటుతో మహిళ..



లక్ష్మి (ఫైల్)

కాటారం: మండలంలోని ధన్వాడకు చెందిన నిమ్మల లక్ష్మి(50) మంగళవారం పాముకాటుతో మృతి చెందింది. లక్ష్మి గ్రామ శివారులోని చేనులోకి పత్తి ఏరడానికి వెళ్లింది. పాము కాటు వేయడంతో అరిచింది. అది విన్న పక్క చేనులో పని చేస్తున్న ఆమె భర్త శంకరయ్య పరిగెత్తుకొని వచ్చాడు. స్థానికుల సాయంతో చికిత్స కోసం మహదేవపూర్‌లోని ప్రభుత్వ సామాజిక ఆ స్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే లక్ష్మి మృతి చెందింది.

హాస్టల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



వివేక్ మృతదేహం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి విజయ్‌పాల్ కాలనీలోని నవయుగ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతున్న వంగపండ్ల వివేక్ (16) మంగళవారం ఉదయం 5.30 గంటలకు హాస్టల్‌లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ షుకుర్ తెలిపారు. చెన్నరావుపేట మండలం జెల్లి గ్రామానికి చెందిన వివేక్ ఐదేళ్లుగా అదే పాఠశాలలో చదువుతున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి రాజు పోలీసులకు చేసిన ఫిర్యాదులో తమ కుమారుడు కడుపు నొప్పితో బాధపడేవాడని పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా.. వివేక్ ఆత్మహత్యకు యత్నించిన యత్నించి.. చనిపోయే వరకు కూడా ప్రతీ అంశం సీసీ కెమెరాలో రికార్డయినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దీంతో పాటు వివేక్ తన నోట్ బుక్‌లో ఏడు పేజీల్లో 'సారీ.. సారీ' అని రాసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..



కలమ్మ మృతదేహం

గార్ల: మండలంలోని సేరిపురం గ్రామానికి చెందిన పోలెబోయిన కలమ్మ(40) ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె తన భర్త నాగేశ్వరరావుతో కలిసి కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో కలమ్మ పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇరుగుపొరుగు వారు చూసి గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపిస్తుడగా ఆమె మృతి చెందింది. మృతురాలి తమ్ముడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు

చైన్ స్నాచింగ్

వరంగల్ క్రైం: సుబేదార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్వకేట్స్ కాలనీలో శ్రీయ లేడీస్ హాస్టల్‌లో ఉంటూ ఆదర్శలా కళాశాలలో చదువుతున్న విద్యార్థిని మెడలోనుంచి గుర్తుతెలియని వ్యక్తి చైన్ ఎత్తుకెళ్లినట్టు సుబేదార్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు మంగళవారం బాధిత విద్యార్థిని వేల్పుల శృతి స్నేహితురాళ్లు అనూష వృతిక, మమతలతో కలిసి హాస్టల్‌కు వెళ్తుండగా ఉదయం 11 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి స్కూటర్‌పై వచ్చి మెడలోని గొలుసును బలవంతంగా లాక్కెళ్లారు. గొలుసు విలువ రూ.80వేలు ఉంటుందని సీఐ పేర్కొన్నారు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

OPEN PLOTS & HOUSES FOR SALE

■ నగరములో అతి తక్కువ ధరకే Open Plots, ఇండిపెండెంట్ Houses మరియు Old Houses లభించును. వివరాలకు వెంటనే సంప్రదించండి. సెల్: 9014743326. [W-775821]

PLOT FOR SASLE

■ మామునూర్‌లో అభివృద్ధి చేసిన కుడా లే అవుట్ 263, 228, 200 గజాలు ప్లాట్లకై. సెల్: 9032111600. [W-775780]

SERVICES

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టెకోవర్ లోన్స్ NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1745]

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1746]

LOANS

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-775823]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్రః 9603055647, 7995392747 [G-971]

WANTED

■ అమృతవర్షిణి సొసైటీ రిజిష్టర్ నెం. 379/2020 త్వరలో ప్రారంభం కానున్న షార్ట్ ఫిలిముల్లో నటించుటకు నటీనటులు కావలెను. షరతులు వర్తిస్తాయి. సంప్ర।। 9502199881. [W-775822]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779876]

■ కాంట్రాక్టర్ వద్ద పెట్రోల్ పంప్ కన్స్ట్రక్షన్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్, సూపర్‌వైజర్స్ & సివిల్ ఇంజనీర్లు కావలెను. సంప్ర।। సెల్: 9989606333, 9000243232. [W-775813]

■ వివిధ విమానాశ్రయాలలో ఉద్యోగావకాశాలు. 10th /ఇంటర్ ఆపై చదివిన వారికి 6నెలలు ట్రైనింగ్ సర్టిఫికెట్ మరియు ఉద్యోగం ఇవ్వబడును. జీతం: 12,000/- నుంచి 15,000/- వయసు 18-26 సం।। వరకు మాత్రమే సంప్ర।। ✆ 93478 58540. [O-786968]

■ స్టార్ హోంకేర్ Hyd. లో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు, టెలీకాలర్స్ కావలెను. జీతం: 16,000/- to 25,000/-. రూం + భో. ఫ్రీ. ఫోన్: 8639132775, 8639828228 [V-775099]

■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+భోజనం. జీ: 18K. ఏజెంట్స్ కమీషన్. 3K Ph: 7569955551, 9848571888 [H-786830]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ।। అదనపు లైను 60/- రూ।।లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.